

నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరుసనగండ్ల సమీపంలోని అయోధ్యనగర్‌లో ఇండ్లను జేసీబీతో కూల్చివేస్తున్న అధికారులు





రోదిస్తున్న బాధితులు, సమయం ఇవ్వాలని అధికారులకు దండంపెడుతున్న బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ యాతం శ్రీను



ఇల్లు కూల్చొద్దంటున్న మహిళను అడ్డుకుంటున్న పోలీసులు

# తెల్లవారుజామునే ఇండ్లపైకి 8 బుల్డోజర్లు

**పోలీస్ బందోబస్తు మధ్య ఆక్రమణల కూల్చివేత ● 34 ఇండ్లను నేలమట్టం చేసిన అధికారులు**

**నాగర్‌కర్నూల్ జిల్లా సిరుసనగండ్లలో మిన్నంటిన ఇండ్ల బాధితుల రోదనలు ● ప్రభుత్వం, అధికారులపై శాపనార్థాలు**

చారకొండ, జూన్ 19 : గురువారం తెల్లవారుజామున 5:30 గంటలకే ఇండ్లపైకి బుల్డోజర్లు.. అడ్డుకునేందుకు స్థానికుల యత్నాలు.. అప్పటికే మోహరించిన పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకోవడం.. కష్టపడి కట్టుకున్న నిర్మాణాలు నేలమట్టమవడం.. మిన్నంటిన స్థానికుల రోదనలతో అయోధ్యనగర్‌లో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిరుసనగండ్ల సమీపంలోని అయోధ్యనగర్‌లో గల సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 327లో 9.11 ఎకరాలు, మరో సర్వే నంబర్ 328లో 7.06 ఎకరాల్లో 50 ఏండ్ల నుంచి ఎందరో ఇక్కడే ఉంటూ జీవనాధారం పొందుతున్నారు. ఆలయ భూములను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని అధికారులు కోర్టును ఆశ్రయించారు. గతేడాది జనవరిలో ఆక్రమణలు తొలగించాలని కోర్టు తీర్పునిచ్చింది. అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కోర్టు సీరియస్ అయ్యింది. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీస్, ఎండోమెంట్ అధికారులు సమావేశమై వెంటనే కూల్చివేతలకు సిద్ధమయ్యారు. ఇండ్ల వాసులకు ఒక్కరోజు గడువు ఇచ్చి.. ముగిసిన తర్వాత 8 జేసీబీలతో ఇండ్లపైకి వెళ్లారు. కల్వకుర్తి ఆర్డీవో శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, అధికారుల ఆధ్వర్యంలో మొత్తం 34 నిర్మాణాలను గంటల్లోనే నేలమట్టం చేశారు.

కాళ్లావేళ్లాపడినా.. కనికరం లేకుండా..

అయోధ్యనగర్‌లో ఇండ్లను కూల్చివేస్తుంటే.. వద్దని బాధితులు అధికారులకు దండం పెట్టి.. కాళ్లావేళ్లా పడ్డారు. అయినా కనికరం లేకుండా కూల్చివేతలు కొనసాగించారు. అడ్డుకోవడానికి యత్నించినా పోలీసులు వారించారు. కొన్నిరోజులు సమయం ఇవ్వాలని వేడుకున్నా ఒప్పుకోలేదు. కనీసం ఇండ్లలోని సామగ్రిని తీసుకోవడానికి సమయం ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారు.

## రైతులకు సంకెళ్లపై రైతు కమిషన్ సీరియస్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): జోగులాంబ గద్వాల జిల్లాలో రైతులకు సంకెళ్లు వేయడంపై తెలంగాణ రైతు కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పెద్దధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా జూన్ 4న నిరసన వ్యక్తం చేసి, విధ్వంసం సృష్టించారనే ఆరోపణలతో 12 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని అలంపూర్ కోర్టుకు హాజరుపరిచే సమయంలో సంకెళ్లు వేసి తీసుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైతు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గురువారం రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జిల్లా ఎస్పీ టీ శ్రీనివాస్‌రావుకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు బేడీలు వేయడం అమానవీయమని మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన ఒక ఆర్‌ఎస్‌ఐ, ఇద్దరు ఏఆర్‌ఎస్‌ఐలను సస్పెండ్ చేసినట్టు చైర్మన్ ఏ కోదండరెడ్డికి ఎస్పీ వివరించారు.

## రైతులకు మొబైల్ ఫోన్లు ఇవ్వని పోలీసులు

అయిజ/అలంపూర్, జూన్ 19 : పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దన్న రైతులపై పోలీసులు కేసులు బనాయించి జైలుకు పంపించిన విషయం విదితమే. రైతులను అరెస్టు చేసిన సమయంలో వారి వద్దనున్న మొబైల్ ఫోన్లు పోలీసులు రాజోళి పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేశారు. 14 రోజుల తర్వాత బెయిల్‌పై వచ్చిన రైతులు గురువారం వారి మొబైల్ ఫోన్లకోసం పోలీస్ స్టేషన్‌కు రాగా మరోరోజు రావాలని స్టేషన్ ఇన్‌చార్జి శిక్షణ ఎస్సై సతీశ్‌రెడ్డి చెప్పడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

## కుంటయ్య ఆత్మహత్య ఘటనలో కాంగ్రెస్ నేతలపై కేసు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదుచేశారు. మంగళవారం దవాఖానలో జడ్జికి ఇచ్చిన మరణవాంగ్మూలంతోపాటు కుంటయ్య భార్య విజయ ఫిర్యాదుమేరకు కాంగ్రెస్‌నేత గంగ కిష్టారెడ్డి, సిరిసిల్లకు చెందిన మల్యాల నాగరాజుపై కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. కిష్టారెడ్డి, నాగరాజు పరారీలో ఉన్నట్టు తెలిసింది.

## ● 'పొద్దుతిరుగుడు' డబ్బులు ఇంకెప్పడిస్తరు?



*పొద్దుతిరుగుడు ధాన్యం డబ్బులు ఇంకెప్పుడు చెల్లిస్తరంటూ రైతులు ఆందోళనకు దిగారు. 75 రోజులు గడుస్తున్నా డబ్బులు అందకపోవడంతో గురువారం సిద్దిపేట జిల్లా తొగుట వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. సొసైటీ చైర్మన్ కే హరికృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి మాట్లాడుతూ.. తొగుట సెంటర్ పరిధిలో నాలుగు వందల మంది రైతులకు రూ.3 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నదని అన్నారు. -మిరుదొడ్డి*



సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటలో ధర్నా చేస్తున్న పోడు రైతులు

## రంగంపేటలో పోడు రైతుల ఆందోళన

**నాలుగు గంటలపాటు రోడ్డుపై బైఠాయింపు**

వీర్నపల్లి, జూన్ 19: ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు గుంజుకుంటే ఊరుకునేది లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేట రైతులు హెచ్చరించారు. సదరు భూముల్లో ప్లాంటేషన్ చేస్తే తమకు ఆత్మహత్యే శరణ్యమని పేర్కొన్నారు. గ్రామంలో పట్టాలు లేని భూముల్లో సర్వే చేసేందుకు రెండోరోజైన గురువారం కూడా ఎఫ్‌ఎస్‌వో పద్మలత, బేస్ క్యాంపు సిబ్బంది అక్కడికి చేరుకోగా, పోడు రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సాగు భూముల్లోకి అధికారులను వెళ్లనీయకుడా రోడ్డుపైనే బైఠాయించారు. 30 ఏండ్ల నుంచి సాగు చేసుకుంటున్న తమ భూములు లాక్కుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల ఆందోళనతో సర్వే చేపట్టకుండానే అధికారులు వెనుదిరిగారు.



## 'భూదాన్' సమస్యను పరిష్కరించరా?

**యాదాద్రి భువమగిరి జిల్లా రాయగిరిలో రసాభాసగా భూభారతి సదస్సు**

భువనగిరి కలెక్టరేట్, జూన్ 19 : తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భువనగిరి మండలం వడాయిగూడెం రైతులు ఆందోళనకు దిగడంతో భూభారతి రెవెన్యూ సదస్సు రసాభాసగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరిలో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అయితే తమ గ్రామ పరిధిలోని 518 సర్వే నంబర్‌లో గల వందలాది ఎకరాలు పూర్తిగా భూదాన్ భూమిగా నమోదైందని వడాయిగూడెం రైతులు ఆందోళనకు దిగారు. భూదాన్ భూమిగా నమోదు కావడంతో తమకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలేవీ వర్తించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే రికార్డుల నుంచి 518 సర్వే నంబరుకు మినహాయింపు కల్పించి తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ సమస్య తన పరిధిలో లేదని తహసీల్దార్ అంజిరెడ్డి పేర్కొన్నారు.

## పసుపు ధర పెంచాలని రైతుల ఆందోళన

**ఎనుమాముల మార్కెట్‌లో రెండు గంటల పాటు నిరసన**

కాశీబుగ్గ (వరంగల్), జూన్ 19 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు రైతులు ఆందోళనకు దిగారు. ఈ-నామ్ ద్వారా పసుపునకు తక్కువ ధరలకే విక్రయిస్తున్నారని తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో రెండు గంటలపాటు క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. విషయం తెలిసిన వెంటనే మార్కెట్ కమిటీ అధికారులతోపాటు అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, ఎనుమాముల ఎస్సై మిరిపెల్లి రాజు పసుపుయార్డుకు వచ్చి రైతులతో మాట్లాడారు.



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు

## రైతాంగంపై కాంగ్రెస్ సర్కార్ వివక్ష

- రంగారెడ్డి జిల్లా పరిధిలో రైతుభరోసా ఇవ్వరా?
- ఇక్కడ ఉన్న వారు రైతులు కాదా?: సబిత ఫైర్

రంగారెడ్డి, జూన్ 19 (నమస్తేతెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలోని రైతులపై ప్రభుత్వం కక్ష కట్టిందని మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి విమర్శించారు. జిల్లాలోని 9 మండలాల్లో నిలిపివేసిన రైతుభరోసా నిధులను వెంటనే రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. గురువారం వారు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా అనగానే ప్రభుత్వానికి అపార్ట్‌మెంట్లు, విల్లాలే గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. జిల్లాలో వ్యవసాయం చేసే ఎంతోమంది రైతులున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, శంషాబాద్, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, గండిపేట, బాలాపూర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి మండలాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో ఈ మండలాల్లో వ్యవసాయమే లేదని.. ప్రభుత్వం రైతుభరోసాను నిలిపివేసిందని విమర్శించారు. ఈ తొమ్మిది మండలాల్లోని అనేక గ్రామాల్లో వ్యవసాయంతో కూరగాయలు సాగవుతున్నాయని తెలిపారు. జిల్లాలోని 48,184 ఎకరాల్లో సుమారు 60 వేల మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని..వారందరికి రైతుభరోసాను ప్రభుత్వం నిలిపివేయడంపై మండిపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలోని అన్ని మండలాలకు రైతుబంధు అందించిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయం పంపిణీ చేయడంలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, పెద్దఅంబర్‌పేట, హయత్‌నగర్ మండలాలతోపాటు తుక్కుగూడ మున్సిపాలిటీలోనూ అనేక గ్రామాల్లో రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. వెంటనే ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా పరిధిలోని రైతులకు రైతుభరోసా జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

## 50 ఏండ్లసంది సాగులో ఉన్నం.. ఎట్ల గుంజుకుంటరు?

- ట్రెంచ్ పనులు చేపడుతున్న అటవీ అధికారులు
- అడ్డుకున్న దళిత రైతులు
- కామారెడ్డి జిల్లా అక్కాపూర్‌లో స్వల్ప ఉద్రిక్తత

మాచారెడ్డి, జూన్ 19: కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో గురువారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. యాభై సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అక్కాపూర్‌కు చెందిన దళితులు వాపోయారు. గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సుమారు 70 ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి. గురువారం అటవీశాఖ అధికారులు పోలీసు బందోబస్తుతో వచ్చి ఆయా భూముల్లో ఒడ్లను తొలగించి ట్రెంచ్ కొట్టించారు. ఈ క్రమంలో అధికారులకు, దళితులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. 50 ఏండ్లుగా తాము ఈ భూముల్లోనే సాగు చేసుకుంటున్నామని, ఇప్పుడు వచ్చి ఈ భూమి తమది కాదనడం సరికాదని వాపోయారు. ఇలా దాడులు చేసి తమ జీవనోపాధిని దెబ్బ తీయొద్దని వేడుకున్నారు. ఈ భూముల్లో 2016 నుంచి ప్లాంటేషన్ చేస్తుంటే ధ్వంసం చేసుకుంటూ వస్తున్నారని మాచారెడ్డి ఎఫ్ఆర్వో దివ్య తెలిపారు. అటవీ భూములు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్య

**మెదక్ జిల్లా రుక్మాపూర్‌లో విషాదం**



చేగుంట, జూన్ 19: అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్‌లో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుక్మాపూర్‌కు చెందిన నాగారం శ్రీకాంత్ (26) తనకున్న ఎకరన్నరలో సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయం బోర్లు , ఇతర అవసరాల కోసం రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో గురువారం ఆయన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చేగుంట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.



## మా భూమిని మాకు ఇప్పించండి

- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

పెద్దపల్లి టౌన్, జూన్ 19: మతిస్థిమితంలేని తన భర్త రాజు శంకరయ్యను మభ్యపెట్టి రూ.కోట్ల విలువైన భూమిని కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పట్టా చేసుకున్నాడంటూ రాజు సుశీల పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళనకుదిగారు. సదరు నాయకుడిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని కొడుకు సతీశ్, బంధువులతో కలిసి పురుగుల మందు డబ్బా పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన శంకరయ్య సింగరేణి విశ్రాంత కార్మికుడని, అతడి పేరిట గ్రామంలో తన మామ నుంచి వారసత్వంగా వచ్చిన 4.28 ఎకరాల భూమి ఉందని తెలిపారు. శంకరయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండేండ్లుగా మతిస్థిమితం కోల్పోయారని పేర్కొన్నారు. ఇదే అదనుగా పెద్దపల్లి మండలం రాఘవపూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు అడెపు వెంకటేశం తన భర్త పేరిట ఉన్న భూమిని వారం క్రితం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందించారు.

# సీతక్కా.. ఇదేందక్కా!

- మంత్రి సీతక్కనోట అబద్ధాల మూట
- 92 వేల మందికిపైగా గ్రీన్ చానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నామని వెల్లడి
- పంచాయతీరాజ్‌శాఖలోని చిరుద్యోగులకు రెండు నెలలుగా అసలే అందని వేతనాలు
- గ్రీన్ చానల్ అంటూ మార్చి నుంచి తాత్సారం
- నేటికీ ఉద్యోగులకు తప్పని ఎదురుచూపులు

> 'ఇకపై చిరుద్యోగులకు నెలనెలా వేతనాలు ఇస్తాం. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్‌ఆర్డీ) పరిధిలో పనిచేసే సుమారు 92 వేల మంది పైచిలుకు ఉద్యోగులకు గ్రీన్‌చానెల్ ద్వారా రూ.115 కోట్లు చెల్లిస్తాం. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వీరికి కూడా ఒకటో తేదీనే వారి అకౌంట్లలో వేతన మొత్తాన్ని జమచేస్తాం'
>
> - ఇదీ గత ఏప్రిల్‌లో మీడియా ముఖంగా మంత్రి సీతక్క ఇచ్చిన హామీ

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ప్రతినెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తున్న మాటలు పచ్చి అబద్ధాలేనని ఇప్పటికే తేలిపోయింది. అదే అబద్ధాల బాటలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కూడా వెళ్తున్నారు. ఆమె శాఖలోని చిరుద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందకపోగా, 92 వేల మందికిపైగా గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ చానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నామని చెప్తున్నారు. అసలు విషయం ఏమిటంటే.. ఆశాఖలోని సుమారు 92 వేల పైచిలుకు మంది చిరుద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందడమే లేదు. మార్చి నెలలో చివరిసారి వారు వేతనాలు తీసుకున్నారు. ఏప్రిల్, మే నెల వేతనాలు ఇంకా రావాల్సి ఉన్నది. 20వ తేదీ వచ్చినా నేటికీ వారికి వేతనాలు రాలేదు. దీంతో ఉద్యోగులంతా ఆందోళనకు దిగేందుకు సిద్ధమవుతున్నారు.

### గతంలోనూ ఇదే మాట

'ఇకపై చిరుద్యోగులకు నెలనెలా వేతనాలు ఇస్తాం. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేసే సుమారు 92 వేలపై చిలుకు మంది ఉద్యోగులకు గ్రీన్‌చానెల్ ద్వారా రూ.115 కోట్లు చెల్లిస్తాం. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో వీరికి కూడా ఒకటో తేదీనే వారి అకౌంట్లలో వేతన మొత్తాన్ని జమచేస్తాం' అని సీతక్క ఏప్రిల్‌లో మీడియా ముఖంగా హామీ ఇచ్చారు. జనవరి నుంచి చిరుద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లిస్తామని ఆమె చెప్తూ వస్తున్నారు. కానీ, ఆమె హామీ మాత్రం అమలు కావడమే లేదు. గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించే విధానానికి సంబంధించిన ఫైల్ ఫైనాన్స్ శాఖ వద్ద ఇంకా పెండింగ్‌లోనే ఉన్నట్టు సమాచారం. మూడు నాలుగు నెలలు ఆ ఫైల్‌కు మోక్షం లభించడమే లేదు. రెండు నెలల వేతనం అందకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఓ టెక్నికల్ అసిస్టెంట్ ఆవేదన వ్యక్తంచేశారు.

> 'పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో 92 వేల మంది పైచిలుకు గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ చానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నాం'
>
> - రెండురోజుల క్రితం ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి సీతక్క ఇలా సెలవిచ్చారు.



నిర్మల్ జిల్లా మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మూత్రవిసర్జనకు వెళ్లేందుకు వరుసలో ఉన్న విద్యార్థులు

## ఒంటికీ, రెంటికీ పరేషాన్

నిర్మల్ జిల్లా మంజులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకే మరుగుదొడ్డి ఉండటంతో ఒంటికీ, రెంటికీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 271 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 150 మంది బాలికలు.. 121 మంది బాలురు. వీరందరికీ ఒకే మరుగుదొడ్డి ఉండటంతో బాలికలు ఒంటికీ, రెంటికీ బారులుదీరుతున్నారు. బాలురు కాంపౌండ్ వాలు దాటి బయటకు వెళ్తున్నారు. సమస్యను గుర్తించిన గత బీఆర్‌ఎస్ సర్కారు 'మన ఊరు-మన బడి' కింద రూ.1.17 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు పనులు పూర్తి చేయించి మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కోరుతున్నారు.

-నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, నిర్మల్